

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



- వివరాలు 6లో -

అరచేతిలో ఆరోగ్య వివరాలు

సంజీవని ప్రాజెక్టు

● జిల్లావ్యాప్త సమాచార సేకరణ ప్రారంభం

● ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో పూర్తి



రామకుప్పం పీహెచ్‌సీలోని డిజిటల్ నెర్వ్ సెంటర్



కుప్పంలో నెర్వ్ సెంటర్ ప్రారంభోత్సవ సందర్భంగా సీఎంతో టాటా సంస్థ ప్రతినిధులు

3.2లక్షలమందికి డిజిటల్ హెల్త్ కార్డులు

కుప్పం నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలు, 2 యూపీహెచ్ సీలు, 92 విలేజ్ హెల్త్ సెంటర్లను అనుసంధానిస్తూ కుప్పం ఏరియా ఆస్పత్రిలో డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.నియోజకవర్గంలోని 3.20 లక్షల మందికి వైద్య పరీక్షలు చేసి వ్యాధుల ప్రొఫైల్‌తో కూడిన డిజిటల్ హెల్త్ కార్డులు సిద్ధం చేశారు. ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి డిజిటలైజ్ చేశారు. దీని కోసం మొత్తం రూ.5.20 కోట్లను కేటాయించగా, రూ.2.50 కోట్లతో అన్ని ఆస్పత్రుల్లో కంప్యూటర్లు, ఫర్నిచర్ వంటి సదుపాయాల్ని ఏర్పాటు చేశారు.

ఆస్పత్రికి వెళ్లిన ప్రతిసారీ అన్నిరకాల పరీక్షలు చేసుకోవాల్సిన అవసరం లేదు. వైద్యులు మారినప్పుడల్లా మన ఆరోగ్య వివరాలన్నీ మళ్లీ మళ్లీ చెప్పాల్సిన పని లేదు. మనకు చేసిన పరీక్షలు, వాడిన మందులు, ఆరోగ్య సమస్యలు, చికిత్స చేసిన వైద్యుడి పేరు.. తదితర వివరాలన్నీ ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. దానికో ఐడీ, పాస్‌వర్డ్ కేటాయిస్తారు. భవిష్యత్తులో వేరే ఆస్పత్రికి వెళ్లినా పేషెంట్ ఐడీ వైద్యుడికి చెబితే చాలు. వైద్యుడు ఆ హెల్త్ హిస్టరీ తెలుసుకుని చికిత్స అందిస్తారు.ఇలా ఆరోగ్య సమాచారాన్ని క్రోడీకరించే కేంద్రాన్ని డిజిటల్ నెర్వ్ సెంటర్ అంటారు.ఆరోగ్యాంధ్ర కల సాకారంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో దీన్ని కుప్పం ఏరియా ఆస్పత్రిలో సీఎం చంద్రబాబు జూలై 3వ తేదీన ప్రారంభించారు. సంజీవని ప్రాజెక్టు అని ఈ పథకానికి పేరు పెట్టారు.తొలి విడతగా కుప్పం నియోజకవర్గం, రెండో దఫాలో చిత్తూరు జిల్లా, మూడో దఫాలో రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమలు చేయనున్నారు. ప్రస్తుతానికి కుప్పం నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సమాచార సేకరణ పూర్తయింది.జిల్లావ్యాప్త ప్రజల ఆరోగ్య సమాచార సేకరణ ఇటీవలే మొదలైంది.

జిల్లావాసులకు రెండో విడత పరీక్షలు

కుప్పం నియోజకవర్గంలోని 3.20 లక్షల మంది ప్రజల హెల్త్ హిస్టరీ నమోదు పూర్తవ్వగా, ఇప్పుడు మిగిలిన జిల్లాలోని 17 లక్షల మంది వివరాలను డిజిటలైజ్ చేస్తున్నారు.కుప్పం తరహాలోనే జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేసి వివరాలను నమోదు చేయనున్నారు. జనవరి నెలాఖరులోగా జిల్లా వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.తరువాత మూడో విడతలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

వీడియోకాల్‌తోనూ వైద్య సేవలు

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 30.90 లక్షల మంది డిజిటల్ నెర్వ్ సెంటర్ సాయం పొందారు. రోగి మారుమూల ప్రాంతంలో ఉన్నా వీడియోకాల్ ద్వారా వైద్యులతో మాట్లాడుతున్నారు. 1.17 లక్షల మంది వర్చువల్ పద్ధతిలో వైద్యుల సూచనలు తీసుకున్నారు. నెర్వ్ సెంటర్‌కు కాల్ చేసి నేరుగా పేషెంట్ తన ఐడీ చెప్పగానే వైద్యులు వివరాలను పరిశీలించి, సమస్య తెలుసుకుని సూచనలు అందిస్తున్నారు. కర్ణాటకలోని కోలారు జిల్లా, హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాస్‌పురంతో పాటు చెన్నై, కోల్‌కతా, గువాహటిలోనూ ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. మంత్రులు లోకేశ్, సత్యకుమార్ గతేడాది కోలార్ వెళ్లి డిజిటల్ నెర్వ్ సెంటర్లను పరిశీలించి వచ్చిన సంగతి తెలిసిందే.

-చిత్తూరు, ఆంధ్రజ్యోతి

CTBTA DATE 30-11-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 127/- డ్రెస్డ్ స్కిన్‌తో 228/-
రిటైల్ లైవ్ బర్డ్ 153/- స్కిన్‌లెస్ 253/-

వెంకటరమణ హార్ట్ & మెటర్నిటీ హాస్పిటల్
డి.నెం. 10-3-206/ఎ3/ఎ, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి, 0877-2258183, 9490109100
ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా॥ సి.వెంకటరమణ ఎం.డి.,డి.ఎం.,(కార్డియాలజీ)
సంపూర్ణ గుండె చికిత్స
ఈసీజీ, 2డి ఎకో & కలర్ డాప్లర్
పీడియాట్రిక్ (చిన్నపిల్లలు) గుండె స్కానింగు
టియం.టి, హోల్టర్
ఏంజియోగ్రామ్, ఏంజియోప్లాస్టీ
పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్
వెంటిలేటర్ సదుపాయం
24 గం॥ ఐసీయు
ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డా॥ ఆర్.నిరుపమ ఎం.బి.బి.ఎస్., డిజిఓ
EHS, WJHS, ALL TYPES OF INSURANCES AVAILABLE APSPDCL
24 గంటలు ఎమర్జెన్సీ, ICU Cathlab, CTOT, Advanced Surgical OT, Labour Room సౌకర్యం కలదు

కాణిపాకంలో అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం

ఏర్పాటు చేస్తామన్న ఎస్పీడీసీఎల్ సీఎండీ

ఐరాల(కాణిపాకం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో త్వరలో అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకురానున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. శనివారం కాణిపాకం వచ్చిన సీఎండీకి , ఎమ్మెల్యే మురళీమోహన్,ఆలయ చైర్మన్ మణినాయుడు, ఈవో పెంచలకిషోర్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అతిథి గృహంలో ఆయనతో వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల నిర్వహణ సమయంలో వాహనాలు తిరిగే సమయంలో విద్యుత్ తీగల కారణంగా తీవ్ర ఇబ్బంది ఉందన్నారు. సీఎండీ స్పందిస్తూ త్వరలో అన్ని విద్యుత్ లైన్లను అండర్‌గ్రౌండ్ విధానంలోకి మారుస్తామన్నారు. ఇందుకు అంచనాలను తమకు పంపాలని సూచించారు. బోర్డు సభ్యులు చంద్రశేఖర రెడ్డి, సుధాకర రెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజునాయుడు, ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



సీఎండీ శివశంకర్‌కు వినాయకుడి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్, ఈవో

నేడు యూపీఎస్సీ పరీక్షలు


తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్, అకౌంట్ ఆఫీసర్స్ పోస్టులకు కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ జిల్లాలో ఆదివారం తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు.ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు నగరంలోని ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ అధికారులు వర్మ, అర్జునకుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడాపోటీలు

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన పోటీలకు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నరేందర్ పడల్ హాజరయ్యారు.క్రీడాకారులైన ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదులకే పరిమితమైన ఉపాధ్యాయులను శారీరకంగా .. మానసికంగా ఉత్సాహపరచడానికి ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ నరేందర్‌పడల్



దూసుకొస్తున్న దిత్వా

నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని శ్రీలంక తీరంలో ఏర్పడిన దిత్వా తుఫాను శనివారం కారైకాల్‌కి 150 కిలో మీటర్లు, పుదుచ్చేరికి 250 కిలో మీటర్లు, చెన్నైకి 350 కిలో మీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. గడచిన 6 గంటల్లో గంటకు 10 కిలో మీటర్ల వేగంతో తుఫాను కదులుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు- పుదుచ్చేరి దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయన్నారు.ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అప్రమత్తంగా వుండండి

● యంత్రాంగానికి కలెక్టర్ సూచన

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో ఆది, సోమవారాల్లో జిల్లాలో భారీ వర్షాలు, గాలులు తలెత్తే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు.ప్రాణ, ఆస్తి, నష్టం సంభవించకుండా తీర ప్రాంతాలు,లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన మేరకు తాత్కాలిక పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.జలపాతాలు, వాగులు, కాలువలు, ప్రమాదకర పర్యాటక ప్రదేశాల మార్గాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఈ విషయంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.విద్యుత్‌శాఖ అవసరమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలు పనిచేయాలని సూచించారు. వ్యవసాయ, పశుసంవర్థక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు రౌండ్ ది క్లాక్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాను సమయంలో వైద్యశాఖ అత్యవసర వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌లను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని, పశువైద్య సిబ్బంది పశువుల కోసం తగిన వైద్య సాయం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద పరిస్థితులు తలెత్తే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశమున్నందున అత్యవసర సమయాల్లో మినహా ప్రజలెవరూ బయట తిరగరాదన్నారు.కాగా తుఫానుపై శనివారం కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.విపత్తు నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ ద్వారా తుఫాను సమాచారాన్ని ఎస్ఎంఎస్‌ల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

పంటలు కాపాడుకోండిలా..

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను నేపథ్యంలో వరి పంటను కాపాడుకునేందుకు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ శనివారం సూచనలు చేశారు. నష్ట తీవ్రతను తగ్గించేందుకు నారుమడి, ఎద పద్ధతిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో 3 రోజుల కన్నా ఎక్కువ వర్షపు నీరు చేరితే మొలక శాతం తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసివేయాలని సూచించారు. పిలక దశలో 5 రోజులు నీటిలో మునిగినా వరి బతికే అవకాశం ఉందన్నారు. వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు రాకుండా లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సా కోనజోల్/1 మి.లీ.ప్రొపి కోనజోల్‌ను పిచికారీ చేయాలన్నారు.వర్షం ముగిసే వరకూ విత్తనాలు వేయడం వాయిదా వేసుకోవాలని సూచించారు.



చిత్తూరులో చిరుజల్లులు

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వ తుఫాన్ ప్రభావంతో శనివారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో ముసురువాన ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు ఎండ ఉన్నా తరువాత వాతావరణంలో మార్పు కారణంగా ముసురుకుంది. చిన్నపాటి చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, ప్రయాణికులు తడుస్తూనే ఇళ్లకు చేరుకున్నారు.

దళితుడని చిన్నచూపా..!

● ప్రొటోకాల్ పాటించడం లేదన్న సత్యవేడు ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'నేను దళితుడిని కాబట్టి చిన్నచూపు చూస్తున్నారు.. అధికారులు ప్రొటోకాల్ పాటించనప్పుడు నాకు ఈ ఎస్కార్టు మాత్రం ఎందుకు..' అంటూ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆక్రోశం వ్యక్తం చేశారు.తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎన్‌కండ్రిగ మండలం కాంపాళెంలో దళిత కుటుంబంపై దాడి జరిగితే బాధితులపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడమేంటన్నారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను సురుటుపల్లె ఆలయ బోర్డులో ఎలా నియమిస్తారని నిలదీశారు. అక్కడ ఒక దళితుడైనా ప్రాతినిధ్యం వహించారా అని ప్రశ్నించారు. సత్యవేడు స్పెషలాఫీసర్‌గా ఉన్న వ్యక్తి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని, టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి ఉన్న విలువ తనకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, కలెక్టర్ వెంకటేశ్వర్,డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల సమీప దుకాణాల్లో తనిఖీలు



దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల సమీపాల్లోని దురాణాల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై చిత్తూరు పోలీసులు తనిఖీలు చేపట్టారు. శనివారం భద్రా బృందాలు, రక్షక్-2 సిబ్బంది, ఎంఎస్‌కేలతో కలిసి సీఐ నెట్టికంఠయ్య రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల సమీపాల్లోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు, సంతపేట హైస్కూల్, తోటపాళ్యం హైస్కూల్, వరదప్పనాయుడు హైస్కూల్‌తో పాటు పలు ప్రైవేటు పాఠశాలల సమీపాల్లోని దుకాణాలను తనిఖీ చేశారు. సిగరెట్లు, హాన్స్ తదితర వాటిని గుర్తించి దుకాణదారులపై బైండోవర్ కేసులు పెడుతున్నట్లు సీఐ తెలిపారు.

గుడిమల్లం పరశురామేశ్వరాలయంవద్ద

అన్నదాన సత్రానికి ఎన్ఎంఏ గ్రీన్ సిగ్నల్

ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ అనుమతి మంజూరు చేసింది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన శివలింగాల్లో ఒకటైన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రోజూ వేలాదిమంది భక్తులు వస్తుంటారు. సౌకర్యాల విస్తరణలో భాగంగా కల్యాణకట్ట, పాకశాల, అన్నదాన సత్రం, యాగశాల, రాధాశాల వంటి నిర్మాణాలకు అనుమతుల కోసం ఎంపీ గురుమూర్తి పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి, పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పలు పర్యాయాలు లేఖలు రాశారు. నిర్మాణాల్లో కొంతభాగం ఆలయ రక్షిత ప్రాంతంలోకి వస్తుండడంతో అనుమతులు ఆలస్యమైనా ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో భక్తులకు అత్యవసరమైన తాత్కాలిక అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేసింది. కాగా, ఆలయాభివృద్ధికి దేవదాయ శాఖ ఇప్పటికే రూ.95లక్షలు సీజీఎఫ్ నిధులు కేటాయించింది.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, చిత్తూరు జిల్లా
2వ అంతస్తు, వివేకానంద భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరు జిల్లా.

2025-27 సంవత్సరమునకు సంబంధించి ప్రజా పంపిణీ పథకం క్రింద స్టేజి-II ద్వారా ఆహార ధాన్యములు మరియు ఇతర నిత్యవసర వస్తువులు రవాణా చేయుట కొరకై

రీ - టెండరు (షార్ట్ నోటీసు)

నం.పి.డి.ఎస్/7/స్టేజి-II/చిత్తూరు 2025-27 తే : 28-11-2025

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, చిత్తూరు వారి తరపున జిల్లా లోని మండల స్థాయి గోదాముల నుండి / నిల్వ గోదాముల నుండి వాటికి అనుసంధానింపబడిన మండలాలలోని చౌక ధర దుకాణములకు, స్కూల్స్, హాస్టల్స్ మరియు ఐ.సి.డి.ఎస్ కేంద్రాలకు ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొనబడు ఇతర ప్రదేశాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయు బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువులను 2025-27 (అగ్రిమెంట్ తేది నుండి 31.3.2027 వరకు) సంవత్సరములకు స్టేజి-II క్రింద రవాణా చేయుటకు ఆన్లైన్ రీ- టెండరు కోరబడుచున్నవి. మండల స్థాయి గోదాములు ఈ కేంద్రములలో కలవు. 1) గంగాధర నెల్లూరు, 2) పూతలపట్టు, 3) కార్వేటినగరం, 4) పచ్చికాపాలెం మరియు 5) నగరి.

స్టేజి-II రవాణా కాంట్రాక్టుకు సంబంధించిన రీ-టెండరు ప్రక్రియ పూర్తిగా AP e-procurement పోర్టల్ నందు మాత్రమే జరుగును. (website Address : https:// tender.apeprocurement.gov.in).

ఆసక్తి గల రవాణాదారుడు/ సంస్థ https://tender.apeprocurement.gov.in website ను సందర్శించి బిడ్ డాక్యుమెంట్ మరియు రీ- టెండరు ప్రకటన వివరాలను పొందవచ్చును. అదేవిధంగా టెండరును దాఖలు చేయుటకు పైన తెలిపిన website నందు రిజిస్టర్ చేసుకుని రూ.5900/- @ 18% GST తో కలుపుకొని టెండర్ షెడ్యూల్ కొరకు ఆన్‌లైన్ ద్వార చెల్లించి టెండరు డాక్యుమెంట్ ను డౌన్లోడ్ చేసుకోగలరు.

AP e-procurement పోర్టల్ నందు టెండరు డాక్యుమెంట్ పొందవలసిన మరియు అప్‌లోడ్ చేయవలసిన తేది మరియు సమయముల వివరములు.

వివరములు తేదీ మరియు సమయము

1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ 01-12-2025 ఉ॥10.30గంటల నుండి
2. ఆన్‌లైన్ బిడ్‌లు స్వీకరణకు చివరి తేదీ 08-12-2025 సా॥ 5.00 గంటలకు.
3. టెక్నికల్ టెండర్స్ పరిశీలించు తేది 09-12-2025 ఉ॥ 11.00 గంటలకు
4. ఫైనాన్షియల్ బిడ్ పరిశీలించు తేదీ 10-12-2025 ఉ॥ 11.30 గంటల నుండి

సం/-జిల్లా కలెక్టర్ మరియు పదవి రీత్యా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా

స్ఫూర్తి



గుడుపల్లె మండలం యామగానిపల్లె స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తూ

జపాన్ హక్కయిడో యూనివర్శిటీలో పీహెచ్‌డీ రీసెర్చ్ గ్రూప్ సభ్యులతో

SUNDAY SPECIAL

కుప్పం కుర్రోడి జపాన్ జర్నీ

అమ్మానాన్నల వెంట పొలంలో కూలిపనులకు వెళ్లిన పిల్లవాడు... బస్సు క్లీనర్‌గా బతుకును ఈడ్చుకొచ్చిన యువకుడు.. చదువుల వంతెన మీదుగా కుప్పం పల్లెనుంచి జపాన్‌కు ఎగిరిపోయాడు. క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో నైపుణ్యం సాధించాడు. పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. జపాన్‌లో ప్రస్తుతం అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో పనిచేస్తున్నాడు. మూలాలు మరచిపోకుండా ఇక్కడి విద్యార్థులకూ మార్గదర్శకుడిగా సేవలందిస్తున్నాడు. గోవిందపల్లె పిలగాడు మురుగేశ్ చదువులయాత్ర విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం..

> మా అమ్మానాన్నలను బెంగళూరునుంచి చెన్నైదాకా విమానంలో తీసుకువెళ్లా. ఈ ప్రయాణం నాకు గొప్ప ఆనందాన్నిచ్చింది. పేదరికం, పల్లె చదువులు.. అని నిరాశ చెందనవసరం లేదు. నిరంతర శ్రమ, పట్టుదల, దృఢ సంకల్పం.. ఇవే నన్ను ఈ స్థితికి చేర్చాయి.

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం, గుడుపల్లె మండలంలో మారుమూల ఉండే గ్రామం గోవిందపల్లె. మురుగేశ్ పుట్టిన ఊరు ఇది. తల్లిదండ్రులు మునస్వామి, యల్లమ్మ బక్క రైతులు. కూలి పనులతోనే జీవనం సాగించేవారు. అమ్మానాన్నల వెంట కూలి పనులకు వెళ్లడం మురుగేశ్‌కూ తప్పేది కాదు. అయితే చిన్నప్పటి నుంచీ చదువులో ముందుండేవాడు. గుడుపల్లె మండలం శెట్టిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో టెన్త్ పరీక్షల్లో 542 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇంజనీరింగ్ చేయాలన్నది మురుగేశ్ కల. ఇంటర్ చదువులకే ఆర్థిక స్తోమత లేదు. వేసవి సెలవుల్లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తూ డబ్బులు పోగేసుకున్నాడు. రోజూ ఇంగ్లీషు పేపర్ కొని క్రమం తప్పకుండా చదివేవాడు.

ట్రిపుల్ ఐటీ దారి చూపింది

పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నాటి ప్రభుత్వం కల్పించిన అవకాశం వరంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మురుగేశ్‌కి సీటు లభించింది. అక్కడే ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంజనీరింగ్ పట్టా కూడా పొందాడు. ఆ తర్వాత విదేశాల్లో చదవాలన్న కోరికకు పేదరికం అడ్డొచ్చింది. అయినా ఆశ వదులుకోలేదు. పట్టుదలను కోల్పోలేదు. మూడేళ్లపాటు ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాసులలో పరిశోధనా మెలకువలు నేర్చుకుంటూ ఉన్నత చదువులకు తయారవుతూ వచ్చాడు. ఇది మురుగేశ్‌కి గొప్ప ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. మద్రాసు ఐఐటీలో మాస్టర్స్ ఎం.ఎస్. రీసెర్చ్ పట్టా పొందగలిగాడు.

జపాన్‌లో పీహెచ్‌డీ

ఐఐటీ చదువుల నిచ్చిన ఆసరాతో జపాన్ వైపు అడుగులు వేశాడు. పూర్తి స్కాలర్‌షిప్పుతో జపాన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఆధ్యాత్మికపరమైన క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో పనిచేశాడు. గోవిందపల్లె పిలగాడు.. డాక్టర్ మురుగేశ్‌గా గౌరవం అందుకున్నాడు. జపాన్‌లో అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో ఇప్పుడు పనిచేస్తున్నాడు. ర్యాపిడస్ ఇంక్ జపాన్ కంపెనీలో ప్రాసెస్ ఇంజనీరు అతని హోదా.

బీజాలు వేసిన ఫిజిక్స్ టీచర్

ఇదంతా అంత సులువుగా జరగలేదు. కెరీర్‌లో మురుగేశ్ ఎక్కిన ప్రతి మెట్టు వెనుక ఎంతో శ్రమ ఉంది. స్ఫూర్తి నింపి ముందుకు నడిపించిన గురువుల పాత్ర ఉంది.2012లో ప్రాణిక్ హీలింగ్‌ను మురుగేశ్‌కు పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు మీనా పరిచయం చేశారు. ప్రాణిక్ హీలింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ శిక్షణా తరగతుల నుంచి, మాస్టర్ డేవిడ్ విజయకుమార్ ద్వారా ప్రేరణ పొందాడు. పీహెచ్‌డీలో కూడా ప్లాస్మా ప్రాసెసింగ్ రీసెర్చ్ సబ్జెక్టును అర్థం చేసుకోవడానికి ఈ ఇద్దరూ దారి చూపారని చెబుతారు మురుగేశ్.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ

మారుమూల గ్రామం గోవిందపల్లె నుంచి జపాన్‌లో ఉన్నతోద్యోగంలో ఉన్న మురుగేశ్ యూట్యూబ్ చానల్ ద్వారానూ, ప్రత్యక్షంగానూ స్ఫూర్తి నింపే పనులు చేస్తున్నారు. భారతదేశంలోను, జపాన్‌లోను వివిధ కళాశాలలు, పాఠశాలలు సందర్శిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నారు. తన సొంత మండలమైన గుడుపల్లెలోని విద్యార్థులకూ అండగా నిలుస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను జపాన్‌లో పరిచయం చేస్తూ, అందులోని విలువలను తెలియజెప్పుతున్నారు.



జపాన్‌లో మన సంస్కృతీ సంబరాలలో



అవగాహన ర్యాలీలో సిబ్బంది

ఎఫ్‌పీవోల బలోపేతానికి సహకారం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీమాస్, వాసన్ ఎన్‌జీవోల భాగస్వామ్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. రైతు సంఘాల అభివృద్ధిపై జిల్లాలోని 13 మండలాలకు చెందిన ఏపీఎం, సీసీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్ మెంబర్లకు టీటీడీసీలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీవోల అభివృద్ధికి సెర్ప్, ఎన్‌ఆర్ఎల్ఎం ప్రాజెక్టు నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. పంటలను నేరుగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, సుధాకర్, ఏపీడీ ప్రభావతి, వెంకటేష్, దాక్షాయని పాల్గొన్నారు.

ఎస్వీయూలో 'అన్వేషణ్'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అన్వేషణ్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ సెనేట్ హాల్లో వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, సీడీసీ డీన్ చెంద్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెంచి, తద్వారా అనేక సామాజిక సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు. ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, హెల్త్ సైన్స్, న్యూట్రీషన్ రంగాల్లో వివిధ కాలేజీల విద్యార్థులు తమ ఆలోచనలకు పోస్టర్, ఓరల్, పేపర్ ప్రెజంటేషన్ రూపమిచ్చారు. వీటిని పరిశీలించిన వీసీ అభినందించారు. ఈ ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.



అన్వేషణ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు

శ్రీసిటీలో ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం

సత్యవేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం శనివారం ముగిసింది. శ్రీసిటీ - శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ బృందం ఈనెల 23న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. 25 మంది సభ్యులు వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్తిశ్రద్ధలతో 12స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠనాన్ని ప్రారంభించి ఈనెల 29న శనివారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తమకు ఈ అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీసిటీ అధినేత డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి భాగవత భక్త సమాజ సభ్యులను శాలువలతో సత్కరించి స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలను అందజేశారు. శ్రీసిటీ ప్రతినిధులు వీఎస్‌బీ శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భాగవత సప్తాహ పఠనం చేస్తున్న భాగవత భక్త సమాజ బృందం



నేడు మిస్ యూనివర్స్ ఏపీ సైకిల్ యాత్ర

● శ్రీకాళహస్తి నుంచి మొదలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నుంచి హైదరాబాద్ వరకు 600 కిలోమీటర్ల మేర మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరామ్ సైకిల్‌యాత్ర జరగనుంది. మహిళ సాధికారత ప్రచార ధ్యేయంతో ఈ యాత్ర సాగుతుంది. పలు ప్రైవేటు సంస్థలు స్పాన్సర్లుగా శ్రీకాళహస్తి నుంచి ఈ యాత్రను ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. పట్టణంలోని భేరివారి మండపం నుంచి ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ప్రారంభించనున్నారు.

ఐసర్‌తో కలిసి పనిచేస్తాం: టాటా స్టీల్



తిరుపతి ఐసర్‌లో టాటా స్టీల్ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ ప్రతీక్ స్వరూప్

ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐసర్‌తో కలిసి నూతన ఆవిష్కరణల కోసం పనిచేస్తామని జంషెడ్‌పూర్ టాటా స్టీల్ సస్టైనబిలిటీ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ డాక్టర్ ప్రతీక్‌కుమార్ దాస్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ఉన్న తిరుపతి ఐసర్‌ను సందర్శించారు. ఐసర్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ బలరామన్‌ను కలిశారు. కెమిస్ట్రీ విభాగంలో విద్యార్థులకు అవకాశాల కల్పన, అకడమిక్- ఇండస్ట్రీని సమ్మిళితం చేయడానికి ఐసర్‌తో కలిసి పనిచేస్తామన్నారు. నూతన ప్రాజెక్టులను ఆవిష్కరిచడంలో భాగంగా హైడ్రోజన్ ఉత్పత్తి, స్టోర్డ్‌బయోమాస్, లిక్విడ్ ఫ్యూయెల్స్ ఉత్పత్తి వంటి అంశాల్లో పరస్పర సహకారం అందించుకునేలా ఐసర్‌తో కలిసి పనిచేస్తామని వివరించారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,044

తలనీలాలు సమర్పించినవారు: 25,559

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు కోరారు. రబీ 2025-26 సంవత్సరానికిగాను దిగుబడి ఆధారంగా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (పునర్వ్యవస్థీకరించ బడిన వాతావరణ ఆధారిత బీమా పథకం కింద) జిల్లాలో వరి, వేరుశనగ పంటలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వరికి గ్రామం, వేరుశనగకు మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. వరికి బీమా రూ.42వేలు కాగా ఎకరాకు రైతులు బీమా ప్రీమియం రూ.630, వేరుశనగకు రూ.30వేలు కాగా రూ.450 కట్టాల్సి ఉంటుందని వెల్లడించారు. వరికి డిసెంబరు 31, వేరుశనగకు డిసెంబరు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్(ఎన్‌సీఐఊఈ)లో బీమాను నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

కావాల్సిన పత్రాలు

పంట బీమా నమోదు చేసుకునే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీపత్రం, రైతు సేవా కేంద్రంలో జారీచేసే పంట సాగు ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, ఫోన్ నంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీని సమర్పించాల్సి ఉంటుంది.

నారాయణవనం తహసీల్దార్ కార్యాలయానికి తాళం

● ఫిర్యాదు చేసిన తహసీల్దార్


నారాయణవనం, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనం తహసీల్దార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు వేశారు. ఈ సంఘటన శనివారం ఉదయం కలకలం రేపింది. నారాయణవనంలో సచివాలయం 3 ఉన్న భవనం కింద అంతస్థులో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు సిబ్బంది కార్యాలయానికి చేరుకోగా వేరే తాళాలు వేసినట్టు గుర్తించారు. వెంటనే తహసీల్దారుకు సమాచారం అందించారు. తహసీల్దార్ రోజారాణి కార్యాలయానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవీంద్ర సిబ్బందితో చేరకుని తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తాళాలు వేసియున్న తహసీల్దార్ కార్యాలయం



గౌతమ బుద్ధుని వృత్తాంతం



తమిళనాడులోని దక్షిణ చిత్ర మ్యూజియంలో విజయకుమార్‌చే కలంకారీ శిక్షణ పొందుతున్న యూరప్ వాసులు



కృష్ణ లీలలు

ఆవులకొండ విజయ్‌కుమార్ కన్నుమూత

శ్రీకాళహస్తికి చెందిన ప్రసిద్ధ కలంకారీ కళాకారుడు ఆవులకొండ విజయకుమార్ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన పెంకులపాడులో ఇంటి వద్దనే ఆయన మృతి చెందారు. కలంకారీ కళాకారుడిగానే కాక, కలంకారీ గురువుగా విజయకుమార్ పేరుపొందారు. దేశ, విదేశాలకు చెందిన ఎందరికో కాళహస్తి కలంకారీ కళను నేర్పించారు. ఎనిమిది పదుల వయసులోనూ కలంకారీ నేర్చుకుంటామని వచ్చే వారికి ఓపిగ్గా నేర్పించేవారు. ఇటీవలే తమిళనాడుకు చెందిన నలుగురు రెండు నెలలపాటు శిక్షణ పొందేందుకు ఆయన వద్దకు వచ్చారు. శిక్షణ పూర్తికాకముందే అనారోగ్యంతో ఆయన కన్నుమూశారు. విజయకుమార్‌కు నివాళిగా ఆయన కళాజీవనయాత్ర విశేషాలు..

■ నివాళి

కలంకారీ గురువు



కనకదుర్గమ్మ

1968లో విజయ్ కుమార్ శ్రీకాళహసిలోని కలంకారి శిక్షణ శిబిరంలో విద్యార్థిగా చేరారు. రెండేళ్లపాటు ఎ. మునికృష్ణయ్య, రమణయ్య, రాంబోజి నాయక్ వద్ద శిక్షణ పొందారు. ఆ తర్వాత అదే శిబిరంలో నాలుగు సంవత్సరాల పాటు బొమ్మలు గీసే కళాకారుడిగా శిక్షణ ఇస్తూ, పని చేశారు. రోజువారి వేతనంపై కలంకారి బొమ్మలు గీశారు. 1976 నుంచి ఈ శిక్షణ శిబిరం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని 1988లో శాశ్వతంగా మూతపడింది. ఆ తర్వాత ఆయన కలంకారీ చిత్ర రచనమీదకన్నా శిక్షణ మీద ఎక్కువ దృష్టి పెట్టారు. స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం ఔత్సాహికులు ఆయన వద్ద శిక్షణ పొందారు.ఫ్రాన్స్ దేశం నుంచి ఆంద్రే దంపతులు ప్రత్యేకంగా ఏడాదిలో వారం రోజులు శ్రీకాళహస్తిలో ఉంటూ పది సంవత్సరాలు పాటు విజయ్ కుమార్ వద్ద కలంకారీ రాతపని నేర్చుకున్నారు. శ్రీకాళహస్తిలో ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించారు. కావలిలో రెండు బ్యాచ్‌లకు ట్రైనింగ్ ఇచ్చారు. తమిళనాడు మహాబలిపురం రోడ్‌లోని దక్షిణచిత్ర మ్యూజియంలో 2000 సంవత్సరం నుంచి 2020 వరకు కలంకారి గురువుగా వారాంతపు రోజుల్లో పలువురికి నేర్పించారు. యూరప్ ఖండం నుంచి 14 దేశాలకు చెందిన కళాభిమానులు ఈయన వద్ద కలంకారీ నేర్చుకున్నారు. వారానికి ఒక రోజు బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనూ, మరొక రోజు చెన్నైలోని నిఫ్ట్ కళాశాలలోనూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారు. కరోనా తర్వాత తన శిక్షణా కార్యక్రమాలను శ్రీకాళహస్తిలోని ఇంటికే పరిమితం చేసుకున్నారు. నాలుగేళ్లుగా చెన్నై ఫైనార్ట్స్ కళాశాల విద్యార్థులు శ్రీకాళహస్తికే వచ్చి శిక్షణ పొందేవారు. శ్రీకాళహస్తిలో కరుణ అనే పేరుతో కలంకారీ కళాకారుల సంక్షేమ అసోసియేషన్ కూడా ఆయన ఏర్పాటు చేశారు. కలంకారీ కళాకారుడిగా విజయ్‌కుమార్ భారతం, రామాయణం, కృష్ణ లీలలు, భాగవతం, గౌతమ బుద్ధుని వృత్తాంతం, అష్టలక్ష్మి, దశావతారాలు వంటి ఇతిహాస చిత్రాలను కలంకారీలో గీశారు. 55 ఏళ్ల క్రితం కలంకారి వృత్తి నేర్చుకున్న తొలి నాళ్లలో వేసిన కనకదుర్గమ్మ, గీతోపదేశం, గౌతమ బుద్ధ వృత్తాంతం చిత్రాలను మాత్రం ఇప్పటికీ బాల్యానికి గుర్తుగా తన వద్దే భద్రపరచుకున్నారు. 'హస్త కళల్లో కలంకారీ ఒక అద్భుతం. వస్త్రంపై బొమ్మలు గీసి సహజ సిద్ధమైన ప్రకృతి రంగులను అద్దటం పురాతన ప్రక్రియ. యాంత్రీకరణ ఎప్పటికప్పుడు అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్నా కలంకారీ హస్తకళకు మాత్రం ఆదరణ తగ్గలేదు.' అని ఆయన చెప్పేవారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తివేత



వెదురుకుప్పం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగడంతో పాటు దిత్వా తుఫాన్ వల్ల మళ్లీ వరద నీరు చేరే అవకాశం ఉన్నందున శనివారం గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. విడుదలైన నీరు తమిళనాడు తరలిపోయింది. కృష్ణాపురం రిజర్వాయర్ ఏఈఈ భాస్కరరాజీవ్, వర్క్‌ఇన్‌స్పెక్టరు వెంకటేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ రికార్డు గది పరిశీలన



తహసీల్దార్, డీటీలకు సూచనలు చేస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయానికి సంబంధించిన రికార్డు గదిని శనివారం ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు. రోజు రోజుకూ రికార్డులు పెరుగుతున్న తరుణంలో స్థలం సరిపోవడం లేదని సిబ్బంది ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పాత ఆర్డీవో, ప్రస్తుత రూరల్ తహసీల్దార్ కార్యాలయ భవనంలోనిరికార్డు గదిని పరిశీలించారు. కొత్త ఆర్డీవో కార్యాలయ భవనం మిద్దెపైనున్న గదిలో కొన్ని రికార్డులను మార్చాలని సూచించారు. నూతనంగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయ భవనంలో రికార్డు రూం నిర్మించకపోవడమేమిటని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో మురళిమోహన్, చిత్తూరు రూరల్ తహసీల్దార్ కళ్యాణి, డీటీ విజయక్రిష్ణ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో ప్రజలకు సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరుసెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పౌరులకు సాధికారిత కల్పించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం అమలుపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. డీఆర్వో మాట్లాడుతూ సమాచార హక్కుకు సంబంధించిన నియమ నిబంధనలు విధివిధానాలను ఈ చట్టం నిర్దేశిస్తుందన్నారు. చట్టానికి అనుసరించి రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. రిటైర్డ్ తహసీల్దారు రఘుపతి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారం ఐదు రోజుల్లో ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ నియంత్రణలోని కార్యాలయాలు సెక్షన్2 పరిధిలో వస్తాయన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, సమాచార హక్కు చట్టం 2005 చూస్తున్న అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో టెన్త్ పబ్లిక్ పరీక్షలకు చెల్లించాల్సిన పరీక్షఫీజు గడువు ఈనెల 25 నుంచి డిసెంబరు 6వరకు పొడిగించినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. జిల్లాలోని గుర్తింపుపొందిన అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని టెన్త్ పరీక్షలు రాసే రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు రుసుము లేకుండా డిసెంబరు 6వ తేదీలోపు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 9వరకు రూ.200 అపరాధ రుసుంతో 12వ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 15లోపు చెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, ప్రైవేటు విద్యార్థులు 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, 3కన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, వొకేషనల్ విద్యార్థులు రెగ్యురల్ ఫీజుతోపాటు అదనంగా రూ.60, అండర్ ఏజ్ విద్యార్థుల ఫీజు రూ.300లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉందన్నారు.

డాక్టర్ వేధింపులపై సిబ్బంది నిరసన



ఐరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు సిబ్బందిని వేదిస్తున్నారంటూ శనివారం ఆసుపత్రి ముందు ఏపీఎన్‌జీవో, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య,ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ ఆసుపత్రి డాక్టర్ ఉద్యోగులను చిన్న చూపు చూస్తున్నారన్నారు. రాత్రి వేళల్లో ఆశా వర్కర్లకు డ్యూటీలు వేస్తున్నారని తెలియజేశారు. సెలవు కావాలని కోరితే ఆసుపత్రికి సంబంధం లేని వ్యక్తి డబ్బులు వసూలు చేస్తున్నాడని వివరించారు. డాక్టర్ డబ్బే ప్రధానంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు.ఇటీవల ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో చిత్తూరు తాలుకా అధ్యక్షుడు భానుప్రకాష్, నాయకులు దేవకుమార్, సురేంద్రనాథ్‌రెడ్డి, మోహన్, శ్రీనివాసమూర్తి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవోలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఉమేష్ కుటుంబ సమేతంగా శనివారం కాణిపాక వరసిద్ధుడ్ని దర్శించుకున్నారు. ఏఈవోలు రవీంద్రబాబు,ధనపాల్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తెల్లగుండ్లపల్లెలో ఎస్పీడీసీఎల్ సీఎండీ



తెల్లగుండ్లపల్లెలో విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న సీఎండీ శివ శంకర్

తవణంపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లెలో గృహాలు, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, లైన్లను ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ శనివారం పరిశీలించారు. విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతూ సరఫరా, సిబ్బంది సేవల గురించి అడిగి తెలుసుకొన్నారు.పైపల్లె సబ్ స్టేషన్ వద్ద వాహనాలకు సంబంధించి విద్యుత్ చార్జింగ్ పాయింట్, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఎస్ఈకి సూచించారు. డైరెక్టర్లు అయూబ్ ఖాన్, గురవయ్య, ఎస్సీ ఇస్మాయిల్, డీఈ మునిచంద్ర, ఏడీ అరుల్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్టు



నిందితుడితో పోలీసులు,రెవెన్యూ అధికారులు

బంగారుపాళ్యం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రెండు కేజీల గంజాయినీ స్వాధీనం చేసుకున్న ఘటనకు సంబంధించి మరొకరిని పోలీసులు శనివారం మరొకరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అరెస్ట్ చేశారు. తాజాగా ఓల్డ్ ముస్లిం కాలనీకి చెందిన అల్లాభక్ష్‌ను తుంబకుప్పం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.







బాలికల విభాగంలో ట్రోఫీతో బంగారుపాళ్యం జట్టు - బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన పీఈఎస్, కృష్ణా జట్లు

బాస్కెట్ బాల్ పోటీల విజేతలు చిత్తూరు, కృష్ణా జట్లు

యాదమరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):యాదమరి మండల పరిధిలోని మోర్దానపల్లి వద్ద వున్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. రెండురోజులుగా జరిగిన పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 41 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.శనివారం వెలుతురు లేమి, వర్షం కారణంగా బాలుర విభాగం ఫైనల్‌లో తలపడ్డ చిత్తూరు (పీఈఎస్ పబ్లిక్ పాఠశాల), గుడివాడ (మాంటిస్సోరి పాఠశాల) జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. విజయవాడ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ జట్టు విద్యార్థులు మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.బాలికల విభాగం ఫైనల్లో బంగారుపాళ్యం, పీఈఎస్ పబ్లిక్ పాఠశాల జట్ల విద్యార్థులు తలపడ్డాయి. బంగారుపాళ్యం జట్టు 28 పాయింట్లతో ట్రోఫీ గెలుపొందగా, పీఈఎస్ పబ్లిక్ పాఠశాల జట్టు 23 పాయింట్లతో రన్నర్స్‌గా నిలిచింది. మదనపల్లె వశిష్ట పాఠశాల జట్టు విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారు. విజేతలకు రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. చెంగల్రాయ నాయుడు, కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు ఎస్‌పీ జయప్రకాష్ ట్రోఫీలు అందజేశారు.పీఈఎస్ పాఠశాల డైరెక్టర్ ఎం. కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణబాబు, పీఈఎస్ పీటీఈలు అరవింద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫైనల్స్‌లో తలపడుతున్న పీఈఎస్, బంగారుపాళెం బాలికల జట్లు

దిగుమూర్తివారిపల్లిలో ఒంటరి ఏనుగు హల్‌చల్



ఏనుగు దాడిలో ధ్వంసమైన వరిపంట



ధ్వంసమైన నాగాలమ్మ ఆలయానికి ఏర్పాటుచేసిన పైపులు

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని దేవళంపేట పంచాయతీ దిగుమూర్తిపల్లి వద్ద శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకొంది. గ్రామంలోని పలువురు రైతులకు చెందిన మామిడి చెట్లు, చెరకు, అరటిచెట్లను ధ్వంసం చేసింది. అలాగే దేవళంపేట, చిన్న నగిరి గ్రామాల్లో వరి పంటను ధ్వంసం చేయడంతోపాటు మామిడి చెట్ల కొమ్మలను విరిచేసింది. నాగాలమ్మ గుడికి ఏర్పాటుచేసిన ఇనుప పైపులను ధ్వంసం చేసింది. అక్కడ నుంచి వచ్చిన మార్గంలోనే తూర్పు విభాగం అడవిలోకి ఒంటరి ఏనుగు చేరుకుంది. శనివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఒంటరి ఏనుగు తిష్ట వేసినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు పలమనేరు అర్బన్ సీఐ మురళీమోహన్ తెలిపారు. సీఐ కథనం మేరకు... పలమనేరు మండలం కోతిగుట్ట గ్రామానికి చెందిన సి.వెంకటేశులు ఆర్మీలో ఉద్యోగం చేస్తూ మూడు నెలలకోసారి స్వగ్రామానికి వచ్చేవాడు. వెంకటేశులు భార్య శిల్ప , పలమనేరు మండలం నూనేవారిపల్లెకు చెందిన ఎం.వెంకటేష్‌లకు అక్రమ సంబంధం ఏర్పడింది. ప్రియుడి మోజులో పడ్డ శిల్ప ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి భర్తను హతమార్చడానికి పథకం రూపొందించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 16వ తేదీన వెంకటటేశులు కోతిగుట్టలోని స్వగ్రామానికి రాగా.. రాత్రి నిద్రపోయే సమయంలో పథకం ప్రకారం శిల్ప ప్రియుడితో కలిసి వేడిచేసిన వంటనూనెను వెంకటేశులు శరీరంపై పోసి పారిపోయారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా.. 5 నెలల నుంచి తప్పించుకొని తిరుగుతుండగా ఎస్ఐ స్వర్ణతేజ, సిబ్బంది శుక్రవారం రాత్రి శిల్ప, ఎం.వెంకటేష్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్లో సృజనాత్మక వేడుకలు



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న దృశ్యం


చంద్రగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం సృజనాత్మక వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వార్షిక స్టీమ్ ఎగ్జిబిషన్‌లో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్,గణితం, సోషియల్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎన్ఎస్ఎస్, క్రీడలు, రోబోటిక్స్, డ్యాన్స్, ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ ప్రయోగాలు, సృజనాత్మక కళా నిర్మాణాలు పలువురిని ఆలోచింపజేశాయి. ప్రతి విద్యార్థి తమ హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్ అనుభవాలను సందర్శకులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేష్ పాటిల్ మాట్లాడుతూ మన విద్యార్థుల్లోని సృజనాత్మకతను, అన్వేషణ భావనను, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడమే కాకుండా వారి ప్రతిభను సమాజం ముందు తీసుకురావడం ఈ ప్రదర్శన లక్ష్యమ న్నారు. ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేసిన విద్యార్థుల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కబీర్ కవితల అనువాద గ్రంథం ఆవిష్కరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాత్విక స్థాయి గల రచయిత తిరువాయిపాటి రాజగోపాల్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర పేర్కొన్నారు. తిరువాయిపాటి రాజ గోపాల్ అనువదించిన కబీరుదాసు వంద కవితల పుస్తకాన్ని తిరుపతిలో శనివారం ఆవిష్కరించారు. బైరాగిపట్టెడలో గల ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర పుస్తకావిష్కరణ చేసిన అనంతరం ప్రసంగించారు. ఆనందమే పరమావధిగా రచనా వ్యాసంగం చేస్తున్న కవి తిరువాయపాటి రాజగోపాల్ అని అభిప్రాయపడ్డారు. దేశం గర్వించదగ్గ గొప్ప రచయిత కబీర్ అని కొనియాడారు. కబీర్ కవితాసారాన్ని ఈతరం అర్థం చేసుకోవాలని కోరారు. రచయిత శైల కుమార్ పుస్తక సమీక్ష చేస్తూ.. జీవిత తాత్వికతను సరళ రీతిలో కబీర్ చెప్పారన్నారు. ఆ సొగసులు రాజగోపాల్ తెలుగుసేతలో చోటు చేసుకున్నాయని తెలిపారు. శంకరంబాడి పీఠం వ్యవస్థాపకులు మస్తానమ్మ అధ్యక్షత వహించారు. పుస్తక గురించి రంగస్థల కళాకారుడు వేణుగోపాలన్,తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ మాట్లాడారు. అనంతరం రచయిత తిరువాయపాటి రాజగోపాల్‌ను తిరుపతి సాహితీమిత్రులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సాకం నాగరాజ, గార్లపాటి దామోదరనాయుడు, తోట వెంకటేశ్వర్లు, పేరూరు బాలసుబ్రమణ్యం ఆర్. సీకే.రాజు, ఇస్లాపురం బాలసుబ్రమణ్యం, మేఘనా గుల్జార్, చెన్న కేశవులు నాయుడు, నెమిలేటి కిట్టన్న, కాంతారావు, నాగార్జున, కిరణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

64 గ్రాముల బంగారు నగల చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీరాములు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండల పరిధిలోని పెరుమాళ్లపల్లిలోని ఓ ఇంట్లో 64 గ్రాముల బంగారు చోరీకి గురైంది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. పెరుమాళ్లపల్లిలో కాపురమున్న పాలపాటి అలేఖ్య స్థానిక సాయి సూపర్ మార్కెట్లో బిల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త బ్రహ్మానందరెడ్డి శ్రీకాళహస్తిలోని గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆమె విధులకు వెళ్లే సమయంలో ప్రతి రోజూ ఇంటి తాళాలు మెట్ల కింద ప్లాస్టిక్ డబ్బాలో ఉంచేవారు. ఈ నెల 27న ఉదయం అందరూ విధులకు వెళ్లారు. పిల్లలు బడికి వెళ్లారు. సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు తెరచి ఉండడం గమనించారు. ఇంట్లో ఎక్కడా పగులకొట్టిన ఆనవాళ్లు లేకపోవడంతో దొంగతనం జరగలేదని భావించారు. మరుసటి రోజు 28న ఆమె భర్త ఇంటికి వచ్చి బంధువుల పెళ్లికి వెళ్లడానికి బీరువాలోని బంగారు నగలు పరిశీలించాడు. అందులో వున్న 64 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. జరిగిన ఘటనపై బాధితురాలు అలేఖ్య శనివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ శ్రీరాములు, సిబ్బందితో వెళ్లి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు క్రికెట్ కోచింగ్ క్యాంపు



బాలుర కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎస్ఏపీఈ గోపి, తదితరులు

నగరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్ ఫెడరేషన్ నిర్వహించే అండర్-14 క్రికెట్ పోటీలకు బాలుర కోచింగ్ క్యాంప్‌ని నాగరాజకుప్పంలో ప్రారంభించారు. ఎస్ఏపీఈ గోపి విద్యార్థులకు క్రికెట్ ఆటలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ కోచింగ్ క్యాంప్‌లో తర్ఫీదు పొందే విద్యార్థులు గుంటూరు జిల్లా పేరెచర్లలో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. శిబిరంలో జిల్లా ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి పి.సురేష్ బాబు, జిల్లా కార్యదర్శి కిషోర్, డివిజనల్ కో-ఆర్డినేటర్ లోకనాథం, కోచ్ బాబు,దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తీర్థం విద్యార్థులు



బైరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గంగాధర్, మిథున్, శశికళ, యశ్వంతి, దిలీప్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీపతి తెలిపారు. ఇటీవల బంగారుపాళ్యంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరు ఈనెల 30వ తేదీన విశాఖపట్టణం జిల్లా అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, సీఆర్పీ షాబుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

డిటిపి ట్రైనింగ్
స్వయం ఉపాధికై పేజ్‌మేకర్, తెలుగు టైపింగ్, ఫోటోషాప్, ఎం.ఎస్.ఆఫీస్, కోరెల్‌డ్రా మొ॥ ఏదేని డిటిపి కోర్సును నేర్వాలని ఉందా? సం.ప్ర.: మురళీస్ జి-ఇన్ఫో, ఎన్.టి.ఆర్. సర్కిల్, తిరుపతి. సెల్:83090 73928, 94948 89525.
AJT -1870

LEASE / RENT
తిరుపతి, చెర్లోపల్లి వద్ద HP పెట్రోల్ బంక్ ఎదురుగా 45x55 కొలతలుగల Godown అద్దెకి ఇవ్వబడును. సంప్ర. : 94400 78441, 97097 97972
AJT - 1855

కంప్యూటర్లు / ల్యాప్‌టాప్స్
కొత్త కంప్యూటర్లు / సెకండ్స్ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్స్ అమ్మబడును. పాతవి అప్‌గ్రేడ్, సర్వీసింగ్ చేయబడును. ఉద్యోగస్తులకు, వ్యాపారస్తులకు 50% ఇన్‌స్టాల్‌మెంట్స్. పాతవి ఎక్స్చేంజి. సంప్ర:S.V. కంప్యూటర్స్, తిరుపతి, సెల్: 83318 57429.
AJT -1801

బిజినెస్ ఆఫర్
తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. అవకాశాన్ని కొల్పోకండి. సంప్రదించండి. RSJ Inspection Service Ltd. Cell:8595924917,8800629648
AJA-257588

FLAT FOR SALE
★ తిరుపతి, మంగళం రోడ్‌లో RTO ఆఫీసు ఇవతల లో, విష్ణు హోమ్స్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం:104, 3BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. కార్ పార్కింగ్, ఈస్ట్ ఫేసింగ్, సంప్ర: Ph:8142084239 AJH-597

WANTED
తిరుపతి పట్టణంలో నర్సింగ్ కాలేజీలో హాస్టల్ నందు వంట చేయుటకు, క్లీనింగ్ చేయుటకు భార్యభర్తలు కావలెను. ఉచిత భోజనము మరియు వసతి కల్పించబడును. సంప్ర: 81064 14956
AJT -082614

WANTED
Superviser (Male) to work in Construction Field with 10 Yrs of Experience. Sal: 25K, Hindi speaking persons prefered. Contact: 97031 44467,68.
AJT -082613

PLOT FOR SALE
శ్రీకాళహస్తి, తొండమనాడు దగ్గర తుడ అప్రూవల్ ప్లాట్లు పూర్తి డెవలప్‌మెంట్‌తో అన్ని డాక్యుమెంట్లతో అమ్మబడును. సెల్: 95027 76981.
AJT -240245

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 257580

కావలెను
ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. అర్హత: ITI ఇంటర్/ డిప్లొమా/ డిగ్రీ (పాస్/ఫెయిల్) విద్యార్థులు పార్ట్‌టైమ్‌గా కూడా చేసుకోవచ్చు వేతనం : కమీషన్ ఆధారంగా. సంప్ర:8977759977, 9618209171
AJA-257570

PLOT FOR SALE
తిరుపతి గ్రాండ్ వరల్డ్ రోడ్డులో ఉపాధ్యాయ నగర్ 100' రోడ్డుకు తూర్పు ముఖము ప్లాటు 52x29'3" సైజు ప్లాట్ (నేరుగా కొనుగోలు చేయువారు మాత్రమే). సెల్: 94406 30789
AJT -1871

PLOT FOR SALE
టయోటా షోరూం (చెన్నై హైవేకి) ప్రక్కన 40 అ: రోడ్డుకు వైకుంఠపురం రియల్ ఎస్టేట్ నందు ప్లాట్‌నెంబర్ 545 వెస్ట్ ఫేసు 56.5X30 (47 అం:లు) TUDA అప్రూవల్ ప్లాట్ అమ్మబడును. సంప్ర: 78400 002131, 94907 73654.
AJT -1859

NEUROLOGIST
డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాల నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 246302

WANTED
Wanted Pre-Primary Teachers and Watchmen Fluency in English is must . Salary up to 20k, Watchmen up to 15k.RTS Olympiad School, Mangalam TPT- 93923 22270, 78931 13557.
AJT - 2380

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

టమోటాకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జనవరి నుంచి టమోటా పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం స్థానిక యార్డులో జరిగిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యార్డులోని గదులను వ్యాపారులకు కేటాయించడం జరుగుతుందన్నారు. పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో ఆదాయ వనరులు పెంచుకోవచ్చని తెలిపారు. వ్యాపారులు, కూలీలు, రైతులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి సరళాదేవి, డైరెక్టర్లు మురళీ, శ్రీదేవి, రవినాయుడు, విశ్వనాథనాయుడు పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.5.16 లక్షలు



బంగారుపాళ్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మొగిలిలోని మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.5.16 లక్షలు వచ్చినట్లు ఆలయ ధర్మకర్త ఎంబి విజయకుమార్,ఈవో మునిరాజులు తెలిపారు. జిల్లా దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ శ్వేత ఆధ్వర్యంలో శనివారం ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కించారు. 89 రోజులకు గానూ హుండీ ద్వారా రూ.4,57,939, అన్నదానానికి రూ.58,279 వచ్చినట్లు వారు తెలిపారు.

స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



విజయ, గిరిధర్‌గుప్త, జ్యోతీరావు

గంగవరం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సమస్యలపై పోరాటం చేయడానికి సీఐటీయూ నాయకులు సిద్ధం కావాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు పిలుపునిచ్చారు. పలమనేరులో రెండురోజుల నుంచి నిర్వహిస్తున్న సీఐటీయూ 9వ మహాసభలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షురాలిగా కె.విజయ, ప్రధాన కార్యదర్శిగా గిరిధర్ గుప్త , కోశాధికారిగా జ్యోతిరావు, ఉపాధ్యక్షుడిగా వాడ గంగరాజు, మమత, షకీలా, గంగ, కార్యదర్శులుగా శ్రీధర్‌బాబు, శివ, గోవిందప్ప, సుబ్బలక్ష్మిలతోపాటు 15 మందిని ఎంపిక చేశారు.

తుఫాన్ తగ్గే వరకు వరికోతలొద్దు

సదుం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు కోతకొచ్చిన వరి పంటను కోయరాదని ఏవో జ్యోతి రైతులకు సూచించారు. తుఫాన్ కారణంగా రాబోవు రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిపై పంట నష్టం జరగకుండా రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా పొలం గట్లను కొంత మేర తెంచాలని, నీటిలో మునిగిన వరిధాన్యం మొలకెత్తకుండా లీటరు నీటిలో 50 గ్రాముల సాధారణ ఉప్పును పిచికారీ చేయాలన్నారు. ఇప్పటికే కోసిన వరి పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆమె సూచించారు.

కరకమందలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం



కరకమందలో విద్యార్థుల ర్యాలీ

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకమందలో సోమల జూనియర్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నడింపల్లె పంచాయతీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈక్రమంలోనే పల్లెలో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, సర్పంచి వెంకటరమణ,అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరమణ

పుంగనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ వెంకటరమణ సూచించారు. సైబర్ సెక్యూరిటీ డే సందర్భంగా శనివారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితం విలువైనదనీ, అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకుండా క్రమశిక్షణతో మెలగాలని తెలియజేశారు. సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు సోమరాజు, అనిల్‌కుమార్, టి.శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాస్, లిఖిత్

పుంగనూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- పలమనేరు మార్గంలోని గూడూరుపల్లె వద్ద రెండు వాహనాలు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పుంగనూరు సమీపంలో జరిగింది. మండలంలోని గూడూరుపల్లె సమీపంలోని జగనన్న కాలనీకి చెందిన శ్రీనివాస్(50) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా నక్కబండకు చెందిన లిఖిత్(17), హరినాథ్(17), సున్ని(17) కలసి ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తూ రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో నలుగురిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. శ్రీనివాస్ పరిస్థితి ఆందోళనగా ఉందని ఇక్కడి వైద్యులు సూచించారు. దీంతో డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

బాల్యవివాహాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాధికారి సావిత్రి బాల్యవివాహాలతో కలిగే సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులు చక్కగా చదువుకుని తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించరాదని వివరించారు. బాలికా విద్య, పోక్సో, దిశ చట్టం గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత పాటించి వ్యాధుల బారి నపడకుండా ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం దేశమ్మ, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, ముబీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వీవో లీడర్లు, డ్వాక్రా మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంటువ్యాధులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తెలియజేయాలన్నారు. ట్రైనర్లు రమేష్, ప్రవీణ్ కుమార్, లోకేష్, వీవో లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కంకర టిప్పర్ స్వాధీనం



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

సదుం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు -సదుం ప్రధాన రహదారిలో కంకర లోడ్డుతో వెళుతున్న టిప్పర్‌ను తిరుపతి విజిలెన్స్ విభాగం ఏవో రామాంజనేయులు సిబ్బందితో కలిసి శనివారం అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్‌కు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడం, ఓవర్ లోడ్డుతో వెళుతుండటం గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి సదుం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేటను అభివృద్ధి చేయాలని సీఎంకు వినతి



సీఎంను కలిసి వినతిపత్రం అందిస్తున్న కుప్పం టీడీపీ నేత కణ్ణన్

కుప్పం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం కొత్తపేటను అభివృద్ధి చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబును అమరావతిలో శుక్రవారం రాత్రి నియోజకవర్గ 11వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి కణ్ణన్ పలువురు దళిత నేతలతో కలిసి వినతిపత్రం అందించారు. కుప్పానికి హంద్రీ-నీవా జలాలు అందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కుప్పం కొత్తపేటలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు భవనాన్ని తొలగించి అదే స్థలంలో ఆర్డీవో, డీఎస్పీ, ఎక్సైజ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను త్వరితగతిన నిర్మించి కొత్తపేటను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా సీఎం స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కందస్వామి, సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలు



రైతు సేవా కేంద్రం ఎదుట మద్యం సీసాలు

సదుం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉన్న ప్రభుత్వ పాఠశాల, కళాశాలలు, కార్యాలయాల వద్ద రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలను కార్యాలయాల ముందే పడేస్తున్నారు. ఎదురుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాలు, వెనుక జడ్పీ ఉన్నత పాఠశాలల మధ్య ఉన్న రైతు సేవా కేంద్రం ముఖద్వారం వద్దనే గత కొన్ని రోజులుగా ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. సంబంధిత కార్యాలయాల సిబ్బంది మందుబాబుల ఆగడాలపై స్పందించకపోవడం, స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ స్థలానికి 2న వేలం

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదనపల్లె రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 0.16 సెంట్ల ఖాళీ స్థలం, మూడు గదులకు డిసెంబరు 2వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని.. ఖాళీ స్థలానికి రూ.లక్ష డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని, హెచ్చుపాట పాడిన వారికి 11 సంవత్సరాల వరకు లీజుకు స్థలం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూములకు సంబంధించి రూ.25 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని, వేలం దక్కించుకున్న వారికి మూడేళ్ల వరకు రూములు కేటాయించనున్నట్లు తెలిపారు.

క్రీడా మైదానంలో ఉపాధ్యాయుల ఉత్సాహం



క్రికెట్ పోటీల్లో బ్యాటింగ్ చేస్తున్న ఎంఈవో శిద్దరామయ్య

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో ఆరోగ్య చైతన్యం, శారీరక దృఢత్వం పెంపొందించేందుకు క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉపాధ్యాయ క్రీడోత్సవాలు నిర్వహించారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు చేపట్టారు. ముందుగా పురుష ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కాగా ఎంఈవో పోకల తాతయ్య మొదటి బౌలింగ్ వేయగా ఎంఈవో శిద్దరామయ్య మొదటి బ్యాటింగ్ చేసి ఉపాధ్యాయులను ఉత్సాహ పరిచారు. త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 9 మంది మహిళా ఉపాధ్యాయులు, క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 16 మంది పురుష ఉపాధ్యాయులు డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయిలో శనివారం ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేశారు. ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

● **కుప్పం:** ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపాలని ఎంఈవో రాజారాం అన్నారు. శనివారం కుప్పం ఎంఎఫ్‌సీ జూనియర్ కళాశాల ఆవరణలో కుప్పం పరిధిలోని ఉపాధ్యాయులకు ఎంఈవో చేతుల మీదుగా క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుప్పంలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో రాజారాం



డివిజన్‌స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయుల జట్టు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న పలమనేరు ఎస్‌వీసీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా పెంచాలని ప్రిన్సిపాల్ వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం పలమనేరు డిగ్రీ కళాశాల విద్యార్థులు గడ్డూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పచ్చని మొక్కలు నాటి, రోడ్లపై చెత్తచెదారం తొలగించి శుభ్రత పాటించాలని గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్.వెంకటేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం చెట్ల నరికివేతపై ఫిర్యాదు

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట పంచాయతీ సరస్వతీపురం వద్ద పొలంలోని రెండు ఎర్రచందనం చెట్లను దుండగులు నరికివేసి విలువైన దుంగలను పట్టుకెళ్లినట్లు బాధితురాలు ఉమాదేవి తెలిపారు. లక్షలు విలువ చేసే వృక్షాలను అక్రమంగా నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల నంజంపేట ఈడ్గా వద్ద దుండగులు రెండు చెట్లను నరికేశారు.

కుక్కల స్వైరవిహారం



సోమల ప్రభుత్వ వైద్యశాల వద్ద వీధికుక్కలు

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని గ్రామాల్లో వీధికుక్కలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. సోమల మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వైద్యశాల వద్ద అధిక సంఖ్యలో మూకుమ్మడిగా దాడులు చేస్తుండటంతో విద్యార్థులు పరుగులు పెడుతున్నారు. నంజంపేట - సోమల మార్గంలోని బజారువీధిలో ద్విచక్రవాహనదారులకు అడ్డువచ్చి చోదకులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రైతుల మేకల, గొర్రెల మందల్లో చొరబడి వాటిని గాయపరుస్తున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



కుప్పం: నూలుకుంటలో కరపత్రాలను అందిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

కుప్పం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు అవసరమైన చర్యలు చేపడుతున్నారని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. శనివారం కుప్పం మండలం నూలుకుంటలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా విడుదల చేసిన కరపత్రాలను ఆయన రైతులకు అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



వల్లిగట్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

● **సోమల:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ ం పనిచేస్తుందని టీడీపీ నాయకులు విశ్వనాథం, సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం వల్లిగట్ల, అగ్రహారంపల్లె, దండువారిపల్లెలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో రామస్వామి, కార్యదర్శి జయరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొరవబోతున్న బైరెడ్డిపల్లె చెరువు



బైరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పెద్దచెరువు పూర్తిగా నిండిపోయి శనివారం ఉదయం నుంచి మొరవపోతోంది. ఎన్నో ఏళ్ల తర్వాత చెరువునిండి మొరవపోతుండటంతో ఆయకట్టు రైతులు, స్థానికులు సంతోషపడుతున్నారు. స్థానికులు పలువురు చెరువువద్దకు వెళ్లి మొరవను తిలకిస్తూ ఉత్సాహంగా గడిపారు. చెరువు నిండటంతో భూగర్భజలాలు వృద్ధిచెంది తాగు, సాగునీటి సమస్య లేకుండా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు హంద్రీ-నీవా జలాల కారణంగా బైరెడ్డిపల్లె చెరువు పుష్కలంగా నిండింది.

నాలుగురోడ్ల కూడలిలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి

బైరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని నాలుగురోడ్ల కూడలి వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రయాణికులు బస్సు కోసం నాలుగురోడ్ల కూడలి వద్ద రోడ్లపైనే నిలబడి నిరీక్షించాల్సివస్తోంది. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటుందని విన్నవిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బస్‌షెల్టర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వరి పంట మొలకెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పుంగనూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంట మొలకెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ శివకుమార్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ దిత్వా తుఫాన్ కారణంగా రెండు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ సూచించినట్లు తెలిపారు. వరిపంటను ఒబ్బిడి చేసిన రైతులు మొలకెత్తకుండా కాపాడేందుకు ఉప్పుద్రావణాన్ని ఒక లీటరు నీటిలో 50గ్రాముల సాధారణ ఉప్పును కలిపి వరిధాన్యంపై పిచికారి చేయాలన్నారు. వర్షాలు ఆగిపోయేంత వరకు వరి పంటను కోత నిలిపివేయాలని ఆయన కోరారు.

సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో వేస్తున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ అలీంబాషా సూచించారు. శనివారం పట్టణంలోని గోకుల్ కల్యాణ మండపం వెనకవైపు వేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. రోడ్డు పనులు చేసి సక్రమంగా క్యూరింగ్ చేయకపోవడంతో నాణ్యత లోపించి రెండు, మూడు నెలల్లోనే మరమ్మతులకు గురవుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ అమ్ము, కాంట్రాక్టర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు



మాదక ద్రవ్యాల వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను ఉపయోగించడంతో ˘లి గే˘ర్థాలు, అనారోగ్య సమస్యలపై మదర్‌థెరీసా విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. మదర్ థెరీసా విద్యార్థులు గంగవరం నుంచి పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. వ్యసనాలకు బానిసలు కాకూడదని, మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

వి.కోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తహసీల్దార్ ఉదయ్ సంతోష్ అన్నారు. గోనుమాకుపల్లె పంచాయతీ తెట్టులో శనివారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పల్లెలోని గిరిజనులతో మాట్లాడి వారికి సౌరహక్కుల గురించి వివరించారు. రాజ్యాంగం మేరకు అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించిందని వారి తెలిపారు. ఆపై అవసరాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్టీ కాలనీకి స్మశానం సదుపాయం, భూములకు రోడ్డు సౌకర్యం కల్పించాలని రోరారు.

క్రీడల్లో నరహరిపేట విద్యార్థుల ప్రతిభ


దీక్షిత-వినీత్-ఉదయ్‌యాదవ్-శరణ్య-మహాలక్ష్మి


చైతన్యప్రసాద్

గుడిపాల. నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన ఫెన్సింగ్ పోటీలలో తొమ్మిదో తరగతి విద్యార్థి వినీత్ స్వర్ణ, దీక్షిత బ్రాంజ్ మెడల్ సాధించారు. పదవ తరగతి చదువున్న చైతన్యప్రసాద్, ఉదయ్‌యాదవ్‌లు కుస్తీ పోటీలో బ్రాంజ్ మెడల్ సాధించారు. వారు అండర్-19 కుస్తీ పోటీలకు తర్ఫీదు తీసుకుంటున్నారు.ఫెన్సింగ్ విజేతలు మహారాష్ట్రలో త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లనున్నారు. శరణ్యమహాలక్ష్మిలు కుస్తీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి అర్హత సాధించారు. ఈ విద్యార్థులందరూ జాతీయ స్థాయిలో పతకాలు గెలవాలని ఎమ్మెల్యే గురజాలజగన్మోహన్, హెచ్‌ఎం దుర్వాసులు, పీఈటీ రవి, విద్యాకమిటి చైర్‌పర్సన్ డిల్లీబాయి ఆకాంక్షించారు.

వైద్య శిబిరాల నిర్వహణకు సిద్ధం కండి


మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను వచ్చే అవకాశం ఉన్నందున గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సంధ్య సిబ్బందికి సూచించారు. శనివారం వైద్యాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆదివానం నుంచి రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆరోగ్య ఎమర్జెన్సీ, ట్రాన్స్‌పోర్టు టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయంలో వైద్యాధికారి చంద్రమహేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ, సిబ్బంది చంద్రశేఖర్ విజయ అందుబాటులో ఉండాలన్నారు.



భూ సమస్యల పరిష్కారానికి కృషి


తహసీల్దార్ కళ్యాణి

చిత్తూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ కళ్యాణి అన్నారు. శనివారం తమ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి సోమవారం కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు నేరుగా వచ్చి కలిసి వినతి పత్రం సమర్పించవచ్చునన్నారు. వాటిని త్వరగతిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు ఉన్నాయని, ఇందుకు ఎల్‌పీఎంలో ఉన్నవారు కలిసి వస్తే సులవుగా పరిష్కారిస్తాన్నారు. రీసర్వే కూడా కచ్చితత్వంతో జరుగుతోందనితెలిపారు.

మార్కెటింగ్‌పై రైతులు అవగాహన పెంచుకోవాలి


రైతులకు సూచనలు చేస్తున్న మార్కెటింగ్ అధికారులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంటలు, పాడి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడంపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ మెంబర్ నళిని తిరుకుమరన్‌లు రైతులకు సూచించారు. శనివారం మార్కెటింగ్ కార్యదర్శి ఇందుమతి, చిత్తూరు వ్యవసాయాధికారి వేణుతో కలిసి దొడ్డిపల్లిలోని రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయోజనాలు వివరిస్తూ సీఎం లేఖను రైతులకు అందజేశారు. రైతు ఉత్పత్తులపై మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఎలాంటి లాభాలు వస్తాయనే దానిపై అవగాహన కల్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న రాజశేఖర్‌నాయుడు

ఐరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యగారిపల్లె ఎస్సీ కాలనీలో మృతి చెందిన బి.ఆదేమ్మ కుటుంబ సభ్యులకు శనివారం మేదరమెట్ల శంకర్‌నాయుడు,పార్వతమ్మ చారిటబుల్ ట్రస్టు అధినేత మేదరమెట్లమోహన్‌నాయుడు తరపున రాజశేఖర్‌నాయుడురూ మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. మేదరమెట్లశంకర్‌నాయుడు,పార్వతమ్మ చారిటబుల్ ట్రస్టు గత మూడు సంవత్సరాలుగా ఇలాంటి వారికి సాయమందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు రాజశేఖర్‌నాయుడు, లక్ష్మీపతి, దేవరాజులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



గంగమ్మ హుండీ ఆదాయం 1.18లక్షలు

శ్రీరంగరాజపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడి దేవస్థానంలోని ఆరిమాని గంగమ్మ ఆలయంలో శనివారం ఆలయ ఈవో వెంకట్రాయులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. 1.18లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వెంకట్రాయులు తెలిపారు. ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు హిమాచలపతిరెడ్డి, సిద్దయ్య శెట్టి, చందు, ఫైనేని మురళి, జ్యోతి, పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాలలో గత రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. మద్యం తాగి వాహనాలను నడిపిన ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వారిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ. 10వేలు వంతున జరిమానా విధించినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడుపుతూ మొదటిసారి పట్టుబడితే రూ.10వేలు జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష పడుతుందన్నారు. , రెండవ సారి పట్టుబడితే రూ. 15వేలు జరిమానా లేదా మూడేళ్ల జైలుశిక్ష లేదా రెండూ విధించవచ్చన్నారు.

ఇద్దరు లాటరీ టిక్కెట్ విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు వ్యతిరేకంగా లాటరీ టిక్కెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు దాడి చేసి ఎంజీఆర్‌వీధికి చెందిన లోకేష్, హకీమ్‌సాహెబ్‌వీధికి చెందిన వేణులను పట్టుకున్నారు. వారి నుంచి నెంబర్లు వేసి ఇచ్చే తెల్లకాగితాలను, రూ.9145 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నెట్టి కంఠయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి


మృతి చెందిన నీలమ్మ

వెదురుకుప్పం, న వంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ రెడ్డేపల్లె కాలనీకి చెందిన నీలమ్మ(65) శుక్రవారం వెదురుకుప్పంకు వెళ్లింది. పనులు చూసుకుని ఆటోలో స్వగ్రామానికి వచ్చి శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో రెడ్డెపల్లె కాలనీ క్రాస్ వద్ద దిగింది. అదే సమయంలో పెద్దబైలుకు చెందిన నరేష్ బైక్‌పై వేగంగా వెళ్తూ ఆమెను ఢీకొట్టాడు. ఆమె కిందపడి గాయపడింది. వెంటనే పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా నీలమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండండి

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దిత్వ తుఫాన్ ప్రభావంతో క నగరపాలక అధికార సంస్థ యంత్రాంగం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మరో రెండుమూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఇంజనీరింగ్, ప్రజారోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నీవానదిలో నీటిమట్టాన్ని అంచనా వేస్తూ పరివాహకప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర సమాచారముంటే 9849907885 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

పిల్లలకు ఆధ్యాత్మిక బోధన

చిత్తూరు కల్చరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక స్వామిరెడ్డి వీధిలో(డోర్ నెంబరు12-543)లో ఆధ్యాత్మిక బోధకులు రామమూర్తి శర్మ చిన్నారులకు ప్రతి ఆదివారం ఉచిత ఆధ్యాత్మిక శిక్షనా తరగతులు నిర్వహించనున్నారు. ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలియజేస్తూ చిన్నారులో నైతిక విలువలు, ఆధ్యాత్మికత భావన పెంచడానికి ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు భగవద్గీత, విష్ణు, లలిత పారాయణం, నీతి చంద్రిక, భాగవత కతలను బోధించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పిల్లల తల్లితండ్రులు సంప్రదించాలని ఆయన కోరారు.

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.5.16 లక్షలు



బంగారుపాళ్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మొగిలిలోని మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.5.16 లక్షలు వచ్చినట్లు ఆలయ ధర్మకర్త ఎంబి విజయకుమార్,ఈవో మునిరాజులు తెలిపారు. జిల్లా దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ శ్వేత ఆధ్వర్యంలో శనివారం ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కించారు. 89 రోజులకు గానూ హుండీ ద్వారా రూ.4,57,939, అన్నదానానికి రూ.58,279 వచ్చినట్లు వారు తెలిపారు.

3 నుంచి 5 వరకు ఆరాధనోత్సవాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): గిరింపేట మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం సుగుణేంద్ర తీర్థముల సన్నిధానంలో సుగుణేంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు డిసెంబరు 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. మఠం మేనేజరు రమేష్ ఈమేరకు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ●గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి ఆలయంలో డిసెంబరు 3 నుంచి 7 వరకు కార్తీక మాస పంచ మహాదీపోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు కుమార్, నిర్వాహకులు కె.యం.కుమార్‌లు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న శ్రీనివాస్

పుంగనూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- పలమనేరు మార్గంలోని గూడూరుపల్లె వద్ద రెండు వాహనాలు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పుంగనూరు సమీపంలో జరిగింది. మండలంలోని గూడూరుపల్లె సమీపంలోని జగనన్న కాలనీకి చెందిన శ్రీనివాస్(50) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా నక్కబండకు చెందిన లిఖిత్(17), హరినాథ్(17), సున్ని(17) కలసి ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తూ రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో నలుగురిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. శ్రీనివాస్ పరిస్థితి ఆందోళనగా ఉందని ఇక్కడి వైద్యులు సూచించారు. దీంతో డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

వాడివేడిగా నగరి కౌన్సిల్ సమావేశం

● కౌన్సిలర్లు వర్సెస్ కమిషనర్


కమిషనర్‌తో వాదిస్తున్న కౌన్సిలర్లు

నగరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కౌన్సిలర్ల సమావేశం శనివారం వాదోపవాదాల మధ్య జరిగింది. చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోడ్డు స్థలం ఆక్రమణ తదితర అంశాలపై కౌన్సిలర్లు కమిషనర్, ఇతర అధికారులతో వాదోపవాదాలు చేసుకున్నారు. గతంలో షాపులను అద్దెకు తీసుకున్న వారి నుంచి బకాయిలు వసూలు చెప్పకపోవడం దారుణమని కౌన్సిలర్ దయానిధి పేర్కొన్నారు. 17వ వార్డు కౌన్సిలర్ చిన్న పాప మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు తమ ఇల్లు పడగొట్టడానికి వాహనాలు తీసుకురావడం అమానంగా ఉందంటూ నేలపై బైఠాయించారు. కమిషనర్ స్పందిస్తూ రోడ్డు స్థలంలో ఇల్లు కట్టినందున తొలగించడానికి వెళ్లామన్నారు. ఈ అంశంపై కాస్సేపు చర్చ జరిగటింది. డయింగ్ యూనిట్ల కారణంగా తాగునీరు కలుషితమైపోయిందని కౌన్సిలర్లు బీడీ భాస్కర్, దయానిధి, ఇంద్రయ్య తదితరులు మండిపడ్డారు. ప్రశ్నించారు. ఓ దశలో కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. తాను వచ్చాక కొంతమేరకు తగ్గించగలిగానని కమిషనర్ చెప్పారు. పొల్యూషన్ బోర్డు పట్టించుకోవాలన్నారు. సమావేశంలో కమిషనర్ కృష్ణారెడ్డి, చైర్మన్ దయానిధి, వైస్ చైర్మన్‌లు వెంకటరత్నం, బాలన్, అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీలో ఖాతాదారులకు విస్తృత సేవలు



మాట్లాడుతున్న మేనేజర్ శరవణ కుమార్

నింద్ర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సేవలను ఖాతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిచ్చాటూరు కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ శరవణ కుమార్ అన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో రైతులకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింద్ర పీఏసీఎస్ పరిధిలో రైతులకు దీర్ఘకాలిక స్వల్పకాలిక రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల బీమాతో పాటు డిపాజిట్లను కూడా స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. లాకర్ సౌకర్యం కూడా ఉందన్నారు. నింద్ర పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు పెరుమాళ్‌రెడ్డి, శివలింగం, సీఈవో సురేష్‌బాబు, కృష్ణ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు


ఉపాధ్యాయుల క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీదేవి

నింద్ర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు వసుమతి, శ్రీధర్‌రాజు అన్నారు. శనివారం మండల స్థాయిలో పురుషులకు క్రికెట్ మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తదుపరి డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, శ్రీనివాసులు, మండల క్రీడా కో-ఆర్డినేటర్ జ్ఞానకుమార్ తదితరులు పాల్గొన్నారు. **నగరి:** రాష్ట్ర ప్రాజెక్టు అధికారి సమగ్ర శిక్ష వారి ఆదేశాల మేరకు ఎమ్మార్సీ వద్ద ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈవో శ్రీదేవి ప్రారంభించారు. **తవణంపల్లె:** అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, త్రోబాల్, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో హేమలత తెలిపారు. విజేతలకు నియోజకవర్గం స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు క్లస్టర్ కోకన్వీనర్ శివ, పీడీ లలితలు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


ఎరువులను పంపిణీ చేస్తున్న గంధమనేని రాజేష్

నింద్ర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నింద్ర రైతుల సంక్షేమమే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ తనయుడు రాజేష్ అన్నారు. శనివారం ఓరూరుపేట పంచాయతీలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి సందేశ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎరువులను రైతులకు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి తులసి, నాయకులు విజయకుమార్ నాయుడు, పురుషోత్తం నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** తుంబపాళ్యంలో జరిగిన రైతన్నా... మీకోసం కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ధరణీప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ రాయితీలను వివరించారు. సర్పంచ్ ఉషశ్రీ, కోదండయాదవ్, తుంబ ఆయుకట్టు చైర్మెన్ మురళి, రమేష్, పాల్గొన్నారు.

తుఫాన్ తగ్గే వరకు వరికోతలు వద్దు

సదుం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు కోతకొచ్చిన వరి పంటను కోయరాదని ఏవో జ్యోతి రైతులకు సూచించారు. తుఫాన్ కారణంగా రాబోవు రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిపై పంట నష్టం జరగకుండా రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా పొలం గట్లను కొంత మేర తెంచాలని, నీటిలో మునిగిన వరిధాన్యం మొలకెత్తకుండా లీటరు నీటిలో 50 గ్రాముల సాధారణ ఉప్పును పిచికారీ చేయాలన్నారు. ఇప్పటికే కోసిన వరి పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆమె సూచించారు.

ఆలయ స్థలానికి 2న వేలం

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదన పల్లె రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 0.16 సెంట్ల ఖాళీ స్థలం, మూడు గదులకు డిసెంబరు 2వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామ తెలిపారు.

సైన్స్‌లో నవ్యంత్‌రెడ్డి సత్తా


ముఖ్య అతిథుల నుంచి అవార్డు అందుకుంటున్న నవ్యంత్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సైన్స్ విభాగంలో చిత్తూరు చెందిన డాక్టర్ నిరంజన్‌రెడ్డి కుమారుడు నవ్యంత్‌రెడ్డి సత్తా చాటాడు. సైన్స్ డెఫినేషన్స్, ఫార్ములాలో ప్రపంచ రికార్డు సాధించాడు. ఇటీవల రాయవేలూరులోని ఫిట్జీ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన పోటీల్లో గంట వ్యవధిలో సైన్స్‌లో ప్రపంచ రికార్డు 900లను అధిగమించి 923 పాయింట్లు సాధించాడు. శనివారం అదే స్కూల్లో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ఎలైట్ ఏసియన్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ తమిళయన్ అవార్డులను అందుకున్నాడు. ఎలైట్ ప్రతినిధులు, డాక్టర్ రామలక్ష్మమ్మ, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో పౌరహక్కులపై అవగాహన

విజయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం ఎస్టీకాలనీలో శనివారం పౌరహక్కులపై తహసీల్దార్ కిరణ్ అవగాహన కల్పించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకొని వినతిపత్రాలుస్వీరించారు. పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఆయన తన కార్యాయంలో మీడియాతో మాట్లాడుతూ తుపానుపై అధికారులను అప్రమత్తం చేశారు.

డ్వాక్రా మహిళలకు శిక్షణ

పెనుమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. థీమ్-5 పచ్చదనం పరిశుభ్రతపై వీవో లీడర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ హబీబ్‌లు శిక్షణ ఇచ్చారు. తడి,పొడి చెత్త వేరు చేయడం, వాటిని సంపదగా మార్చే విధానాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వలన కలిగే హానికర ప్రభావాలు, కాలుష్యం నియంత్రణచర్యలపై శిక్షణ ఇచ్చారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరగుడి పల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఆలయ ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

1 నుంచి భగవద్గీత ప్రవచనాలు

చిత్తూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో డిసెంబర్ 1 నుంచి 11వ తేదీ వరకు భగవద్గీత ప్రవచనాలు నిర్వహించనున్నట్లు కట్టమంచి లోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ నిర్వాహకులు తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శ్రీమద్భగవద్గీత ప్రవచనకకర్త రాజయోగి బికె. రాంప్రసాద్ ప్రవచనా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కన్యకాపరమేశ్వరి దేవస్థాన సత్రంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, టీటీడీ కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ప్రవచనాలుంటాయన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

పరిశోధనా సదస్సులో తిరుకుమరన్ ప్రతిభ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నేపాల్ లింగ్విస్టిక్ సొసైటీ ఈనెల 26,27 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో స్థానిక సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకులు తిరుకుమరన్ రిసోర్స్ పర్సన్‌గా హాజరై ప్రతిభ చూపారు. "కాంటెస్టువల్ అప్రోచ్ టు టీచింగ్ ఫొనెటిక్స్ టు అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ఆఫ్ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్-రిజల్ట్ ఓరియంటెడ్ నావల్ స్ట్రాటర్జీ" అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. విద్యా సేవలు అందించిన ఆయన్ని కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ ఉషారాణి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విజయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కోసలనగరం, కేశవపురం ప్రాథమిక పాఠశాలల్లో విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య శనివారం విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. విద్యార్థులకు ఉపయుక్తంగా క్రయాన్స్, నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, మణి, వెల్ఫేర్ అసిస్టెంట్ సృజన, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర టిప్పర్ స్వాధీనం



సదుం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరు -సదుం ప్రధా న రహదారిలో కంకర లోడ్డుతో వెళుతున్న టిప్పర్‌ను తిరుపతి విజిలెన్స్ విభాగం ఏవో రామాంజనేయులు సిబ్బందితో కలిసి శనివారం అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్‌కు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడం, ఓవర్ లోడ్డుతో వెళుతుండటం గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి సదుం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

డ్వాక్రా మహిళల ర్యాలీ

బంగారుపాళ్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళా సంఘాల ఆర్థికలావాదేవీలను డిజిటల్‌గా నమోదు చేయడమే ఎండిఎంఎల్ యాప్ ఉద్దేశమని ఎంపీఎం రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వచ్చి మానవహారంగా ఏర్పడ్డారు. మన డబ్బు- మన లెక్క పై ప్లకార్డులు ప్రదర్శించారు. సంఘ మిత్రలకు ఈ- నారీ పేరుతో జిల్లా సీఆర్పీ విను ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. సీసీలు,సంఘమిత్రలు,వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

నగరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పచ్చదనం-పరిశుభ్రతపై శనివారం స్వయం సహాయక సంఘాలకు రోజు శిక్షణ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాల పై ఎంపీడీవో వాణి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాణి, వైస్ ఎంపీడీవో బాబు, ఎంసీవో ధనసింగ్, ప్రవీణ్, మోహన్ పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల తనిఖీ

నగరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్, మండల పరిధిలోని కళాశాలలు, పాఠశాల బస్సులను శనివారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి తనిఖీ చేశారు. యాజమాన్య ప్రతినిధులకు విద్యార్థుల బస్సులకు సంబంధించి తీసుకోవల్సి భద్రతా చర్యల గురించి వివరించారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను విధిగా ఉండాలని స్పష్టం చేశారు.

చెరువు వేలంపై సర్పంచ్ ఫిర్యాదు

విజయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ళత్తూరు చెరువు వేలంపై ఆ గ్రామ సర్పంచ్ విజయరాఘవులు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి చెరవు వేలం విషయమై డివిజినల్ అధికారి నుంచి అనుమతి రాలేదని చెప్పి తనకు తెలియకుండా వేలం వేశారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.